
ప్రజాశక్తి
శుక్రవారం 13 జూన్ 2025
5
పార్వతీపురం మన్యం



టెన్త్ సప్లిమెంటరీ ఫలితాల్లో 85.58శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎపి విద్యాశాఖ గురువారం విడుదల చేసిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లాలో 617 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే 528 మంది ఉత్తీర్ణత సాధించారు. 85.58శాతంతో రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచింది. 385 మంది బాలురు పరీక్ష రాస్తే 327 మంది పాసయ్యారు. 232 మంది బాలికలు పరీక్ష రాస్తే 201 మంది పాసయ్యారు. జూన్ 13 నుంచి 19 వరకు రీకౌంటింగ్ (ఒక్కో సబ్జెక్ట్ రూ.500), రీ వెరిఫికేషన్(రూ.1000) కోసం విద్యార్థులు అప్లై చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంకెంతమంది పొట్టకొడతారో?



- నిన్నటి వరకు ఫీల్డ్ అసిస్టెంట్లు, విఎఎలు
- నేడు మున్సిపల్ కార్మికుల వంతు
- 20మంది చిరుద్యోగులపై వేటుకు కౌన్సిల్ తీర్మానం
- తెరవెనుక ఎమ్మెల్యే మంత్రాంగం?

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యే లు, మంత్రి ఇంకెంత మంది పొట్ట కొడతారోనన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో పదుల సంఖ్యలో చిరుద్యోగుల తొలగింపు కొనసాగుతోంది. తొలగించబడిన వారు చేసిన తప్పు ఏమిటంటే గత ప్రభుత్వ హయాంలో వారు నియామకం కావడమే. వైసిపి ప్రభుత్వం హయాంలో అనేకమందిని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా, డిఆర్‌డిఎలో విఒఎలుగా నియామకమయ్యారు. అంతేకాకుండా జిల్లాలోని కస్తూరిబా బాలికల పాఠశాలలు, మోడల్ పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా నియామకం పొందారు. ఇలా నియామకం పొందిన వారిలో ఎక్కువ మంది గిరిజనులు, దళితులు, బిసిలకు చెందిన నిరుపేదలే ఉన్నారు. అనంతరం టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలో అధికారపార్టీ నాయకుల ఫిర్యాదు మేరకు అనేక గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, విఒఎల తొలగింపు జరిగింది. సాలూరు, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేల సిఫార్సు మేరకు అధికారులు వీరిని తొలగించారు. తప్పుడు ఫిర్యాదులు చేయించడం, విచారణ నిర్వహించడం, ఆరోపణలు రుజువు చేసిన తర్వాత నిర్ధాక్షిణ్యంగా వారిని తొలగించి కొత్త వారిని నియమించుకోవడం జరిగింది. ఇలా జిల్లా వ్యాప్తంగా సుమారు వంద మందిని తొలగించి అధికారపార్టీకి చెందిన సానుభూతిపరులను నియమించుకున్నారు. ఈ ప్రక్రియలో పని చేస్తున్న వారిని తొలగించి కొత్త వారి నుంచి ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారపార్టీ ఎమ్మెల్యేల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ప్రభుత్వ శాఖల్లో ఏ చిన్న ఉద్యోగం దొరికినా తన బతుకు బండిని నడిపించుకోవచ్చుననే ఆశతో చాలామంది చేరుతున్నారు. ఒకటో, రెండో ఏళ్లు పనిచేసిన తర్వాత ప్రభుత్వం మారితే ఇలాంటి చర్యలకు సిద్ధమవుతున్నారు. సిపిఎం, సిఐటియు నాయకుల ఆధ్వర్యాన బాధిత కుటుంబాల తరపున పోరాటాలు చేసినా ఫలితం కనిపించడం లేదు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపును ఒక ఆదాయ వనరుగా అధికారపార్టీ ఎమ్మెల్యేలు మలుచుకుంటున్నారు. కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగులను నిర్ధాక్షిణ్యంగా తొలగించడం మానవత్వానికే మచ్చగా కనిపిస్తోంది.

యథా రాజా తథా ఎమ్మెల్యే లు

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది లోనే వేలాదిమంది చిరుద్యోగుల పొట్ట కొట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం నియమించిన గ్రామ, వార్డు వాలంటీర్లకు రూ.10వేలు జీతం పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలగించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సేల్స్ మాన్, సూపర్ వైజర్లను కూడా ఈ ప్రభుత్వం నిలిపివేసింది. ఇటీవల ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీలో భాగంగా నియమించిన ఎండియు ఆపరేటర్లను కూడా ప్రభుత్వం ఇంటికి పంపించేసింది. ప్రభుత్వం అనుసరించిన తొలగింపు బాటలోనే అధికార పార్టీ ఎమ్మెల్యేలు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల బతుకులపై పిడిగుద్దులు గుద్దుతున్నారు. జిల్లాలో ఇంతవరకు ఎమ్మెల్యేల సిఫార్సు మేరకు ఫీల్డ్ అసిస్టెంట్లు, విఒఎల తొలగింపుతో పాటు కెజిబివి, మోడల్ పాఠశాలల్లో పని చేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కూడా తొలగించారు. ఇవి చాలక పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సిఫార్సుతో మున్సిపాలిటీలో పని చేస్తున్న 20మంది చిరుద్యోగులపై వేటుకు రంగం సిద్ధం చేశారు. 2022లో గత ప్రభుత్వ హయాంలో ఆప్కాస్ ద్వారా 13మంది పబ్లిక్ హెల్త్ వర్కర్లు, ఇద్దరు డ్రైవర్లు, ఐదుగురు నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్లను నియమించారు.వీరిలో ఎక్కువ మంది నిరుపేద దళితులే ఉన్నారు. మూడేళ్లుగా పని చేస్తున్న వీరిని తొలగించాలనే కుట్రకు టిడిపి నాయకులు వ్యూహరచన చేశారు. గురువారం చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశం అజెండాలో 20మంది మున్సిపల్ వర్కర్ల తొలగింపు అంశాన్ని చేర్చారు. కౌన్సిల్‌లో టిడిపికి ఆధిక్యత ఉన్న కారణంగా వారిని తొలగించేందుకు తీర్మానాన్ని ఆమోదించారు. రెక్కాడితే గాని డొక్కాడని బడుగు జీవుల బతుకులపై వేటుకు అధికారపార్టీ ఎమ్మెల్యే రంగం సిద్ధం చేయడం విమర్శలకు తావిస్తోంది. ఏడాది పాలనలోనే ఇంతమంది చిరుద్యోగుల పొట్ట కొడితే రానున్న నాలుగేళ్ల లో ఇంకెంత మంది బతుకులు బుగ్గి పాలు చేస్తారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు అన్యాయం

ప్రభుత్వం మారినప్పుడల్లా చిరుద్యోగుల తొలగింపు కార్యక్రమం చేపట్టడం సరికాదు. ఇప్పటికే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేలాదిమంది నిరుద్యోగులను తొలగించింది. వాలంటీర్లు, వైన్ షాప్‌ల్లో పని చేసే సేల్స్ మాన్, సూపర్‌వైజర్లను తొలగించారు. ఇటీవల ఎండియు ఆపరేటర్లను తొలగించారు. అదే దారిలో జిల్లాలోని ఎమ్మెల్యేలు కూడా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు చేపడుతున్నారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, విఒఎలు, కెజిబివి, మోడల్ పాఠశాలల్లో పని చేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించారు. ఇప్పుడు తాజాగా పార్వతీపురం మున్సిపాలిటీలో పని చేస్తున్న 20మంది చిరుద్యోగులపై వేటుకు రంగం చేస్తున్నారు. ప్రజారోగ్య శాఖ, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడానికి అధికారపార్టీ నాయకులు ప్రయత్నించడం అన్యాయం. కొత్త ఉద్యోగాలు ఇవ్వడం లేదు. ఉన్న ఉద్యోగులను నిర్ధాక్షిణ్యంగా తొలగించడం అమానుషం.

బివి రమణ, సిఐటియు జిల్లా కార్యదర్శి

సమస్యలు పరిష్కరించనందుకా సంబరాలు ?

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం, కురుపాం

జిల్లాలో సమస్యలు పరిష్కరించని టిడిపి కూటమి ప్రభుత్వానికి సంబరాలు ఎందుకని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రశ్నించారు. గురువారం గుమ్మలక్ష్మీపురంలో మండల సిపిఎం కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటిమి ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని, సూపర్ సిక్స్ ఇస్తామని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదని విమర్శింఆచరు. ఎండియు వాహనాలతో ఇంతవరకు గిరిజనులకు బియ్యం అందేవని ఇప్పుడు గిరిజనులు 5 నుంచి 10 కిలోమీటర్లు నడిచి వచ్చి రేషన్ బియ్యం తీసుకెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేదు సరి కదా ఉన్న సౌకర్యాలు తీసేశారని ఎద్దేవా చేశారు. అలాగే జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులైన జంఝావతి, గుమ్మడిగెడ్డ, ఆడారుగెడ్డ, వనకాబడిగెడ్డ, జంపరకోటగెడ్డ, రాళ్లగెడ్డ, తోటపల్లి హైల్యాండ్‌తో పాటు గిరిజన ప్రాంతంలో ఉన్న చెక్ డాములు అతి తక్కువ ఖర్చుతో పూర్తయి, జిల్లాలో ప్రతి సెంటు భూమికి సాగునీరందుతుందన్నారు. కానీ వీటిని పూర్తి చేయడం లేదని, గోదావరి - బనకచర్లకు రూ.80 వేల కోట్లు పెట్టి ప్రాజెక్ట్ కడతామని చంద్రబాబునాయుడు ప్రకటిస్తున్నారని మన్యం జిల్లాలో ఇవి కనిపించడం లేదాని ప్రశ్నించారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఒత్తిడి చేయడం లేదన్నారు. అలాగే గిరిజన యూనివర్సిటీ, గిరిజన ఇంజనీరింగ్ కాలేజీలు ఇంతవరకూ ప్రారంభించలేదని, నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వలేదని అన్నారు. ఆశ్రమ పాఠశాలలో ఎఎన్‌ఎం పోస్టుల భర్తీకి మంత్రి సంధ్యారాణి మొట్ట మొదటి సంతకం చేశానన్నారని, ఇంత వరకు ఆ ఫైల్ ఎక్కడుందో ఆమెకే తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. భద్రగిరి, కురుపాం, పాలకొండ, సీతంపేట, సాలూరు, పార్వతీపురం హాస్పిటళ్లలో రోగులు ఒక్కొక్క బెడ్డుపై ముగ్గురు నుంచి, నలుగురు ఉన్నారని, కనీసం తాత్కాలిక బెడ్‌లు కూడా ఏర్పాటు చేసి వైద్యం అందించాలన్న ఆతృత ఈ ప్రభుత్వానికి కానీ ప్రజా ప్రతినిధులకు కాని లేదని అన్నారు. జీవో 3ను పునరుద్ధరిస్తామని కురుపాం సభలో చెప్పిన చంద్రబాబు ఆ జీవో ఇవ్వలేదని, స్పెషల్ డిఎస్సి తీయలేదని విమర్శించారు. 8 వారాలుగా ఉపాధి బకాయిలు కూలీలకు ఇవ్వకపోతే ఇక్కడ స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని అన్నారు, జీడి, చింత ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని చేయలేదని, సీతానగరం మండలం లచ్చయ్యపేటలోని షుగర్ ఫ్యాక్టరీని తాము అధికారంలోకి వస్తే ప్రారంభిస్తామన్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయ్ చంద్రకు ఇప్పుడా ఫ్యాక్టరీ ఎక్కడ ఉందో తెలియదని ఎద్దేవా చేశారు. పూర్ణపాడు-లాభేసు వంతెన ఎప్పటికి పూర్తి చేస్తారని, మన్యం జిల్లా నుండి ఏనుగులను ఎప్పుడు తరలిస్తారని ప్రశ్నించారు. కావున టిడిపి ప్రభుత్వం సంబరాలు చేసుకోవాలంటే జిల్లాలోని ఈ సమస్యలన్నీ పరిష్కరించి సంబరాలు జరుపుకోవాలని అన్నారు. లేకపోతే రానున్న రోజుల్లో ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటం చేస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ, మండల కమిటీ సభ్యులు మండంగి శ్రీనివాసరావు, బిడ్డిక శంకర్రావు, పువ్వల తిరుపతిరావు, మండంగి సన్యాసిరావు, మండల సుబ్బారావు, మండంగి నూకయ్య పాల్గొన్నారు.

20న పిసిసి చీఫ్ పాడేరు పర్యటన

సాలూరు:ఎపి పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల జిల్లాల పర్యటనలో భాగంగా ఈనెల 20న పాడేరు జిల్లాలో పర్యటించనున్నారని నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకృష్ణ చెప్పారు .ఈ సందర్భంగా పాడేరు, పార్వతీపురం మన్యం జిల్లాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు. పార్టీ కేడర్‌ను ఉత్తేజపరిచే ఉద్దేశంతో షర్మిల జిల్లాల పర్యటనకు వస్తున్నారని చెప్పారు.

మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం : డిఆర్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

పాఠశాలలు, వసతి గృహల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన, బలవర్ధకమైన ఆహారాన్ని అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత పేర్కొన్నారు. అందులో భాగంగా జిల్లాలోని 1,504 పాఠశాలలకు 5,184 (25 కేజీలు) బస్తాలను, 150 వసతి గృహాలకు 13,456 బస్తాల ఫోర్టిఫైడ్ సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. గురువారం స్థానిక డివిఎంఎం స్కూల్లో ట్రేసబిలిటీతో ఫైన్ క్వాలిటీ ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ కార్యక్రమం పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి డిఆర్ఒ ముఖ్యఅతిథిగా పాల్గొని డిఇఒతో కలిసి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులకు బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫోర్టిఫైడ్ సన్న బియ్యం బస్తాపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు చూపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి బస్తాపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, దీన్ని స్కాన్ చేయగానే బియ్యం ఏ సీజన్‌లో పండింది, పండించిన రైతు, చేరుకున్న రైతు సేవా కేంద్రం, బియ్యం రకం, ఏ రైసు మిల్లులో మరపట్టబడింది, చేరుకున్న స్టోరేజీ గోదాము, రైస్ వచ్చిన ప్రాంతం, ధ్రువీకరించిన సాంకేతిక సిబ్బంది, ప్యాకింగ్ ఏజెన్సీ పేరు తదితర వివరాలు తెలుసుకొనే అవకాశం ఉందని అన్నారు. ఈ విధంగా పంపిణీ చేయడం వల్ల ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా సరుకు పంపిణీ అవుతుందని ఆమె తెలిపారు. పాలకొండలోని శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్ నుంచి బియ్యం ప్యాకింగ్ అయి వచ్చినట్లు చెప్పారు. గురువారం నుంచి ఈ సన్న బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించడం జరుగుతుందని, విద్యార్థులు తప్పనిసరిగా ఈ పోషకాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఐ.రాజేశ్వరి, డిఇఒ బి.రాజ్‌కుమార్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వారణాసి శ్రీధరరావు, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు సన్నబియ్యం అందజేస్తున్న డిఆర్ఒ హేమలత

మా బడిని మూసివేయ వద్దు

పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పలగరలో గల గుడివాడ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్ పేరుతో తొలగించవద్దని గురువారం ఆ పాఠశాల వద్ద గుడివాడ కాలనీ, కొట్టిశ కాలనీ వాసులు తమ పిల్లలతో కలిసి తల్లిదండ్రులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ తాము మడ్డువలస రిజర్వాయర్ ముంపు గ్రామాల నుంచి వచ్చిన నిర్వాసితులమని, 20ఏళ్లుగా గుడివాడ కాలనీ కొట్టిశ కాలనీగా ఏర్పడి సుమారు 500 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. అప్పటి ప్రభుత్వం నిర్వాసితుల పిల్లల చదువుకు తమకు దగ్గర్లో పాఠశాలలు కట్టించారని, అప్పట్నుంచి తమ పిల్లలు ఇక్కడే చదువుతున్నారని అన్నారు. తామంతా వ్యవసాయ పనుల కోసం వలసలు పోతూ వస్తూ ఉంటామని, మా ఇళ్ల వద్ద ముసలివాళ్ల వద్ద పిల్లలను ఉంచి వలసలు పోతున్నమని తెలిపారు. మా నిర్వాసితులకు అందుబాటులో పాఠశాల ఉండడం వల్ల ఎంతో ఉపయోగమన్నారు. పైగా మోడల్ స్కూల్ పేరుతో పలగర పాఠశాలను మార్చడం వల్ల మార్గ మధ్యలో శ్మశాన వాటిక, రెండు చెరువులు, పెద్ద అంకలాం కాలువ ఉండడం వల్ల ఎప్పుడు ఎటువంటి పమాదం జరిగే అవకాశం ఉంటుందోనని భయాందోళన వ్యక్తం చేశారు. తమ పిల్లలకు చదువు చెప్పాలని, మధ్యాహ్నం భోజనం పెట్టకపోయినా క్యారేజీలు భోజనం పంపిస్తాం గానీ వేరే స్కూల్‌కు పంపించమని తల్లిదండ్రులు. తేల్చి చెప్పారు. ఇదిలా ఉండగా మీ పిల్లల్ని మోడల్ స్కూల్‌కు పంపకపోతే మధ్యాహ్నం భోజనం ఉండదని అధికారులు చెప్పడంతో భోజనం మాకొద్దు మా పిల్లలకు, మాకు ఈ బడే కావాలంటూ తల్లిదండ్రులు తమ పిల్లలను తమ ఇళ్లకు తీసుకుపోయారు. ఈ ఆందోళనకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో స్కూలు కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు నారాయణరావు, బుడ్డి, జయ్యమ్మా, నూకమ్మ, శంకర్ బుడ్డి జయమ్మ రాజు రాము తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నిర్వాసితులు, రైతు సంఘం నాయకులు

తోటపల్లి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద ఎపి రైతు సంఘం ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

తోటపల్లి బ్యారేజ్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడుతూ తోటపల్లి నిర్వాసితుల పెండింగ్ సమస్యలు గత ప్రభుత్వం పరిష్కారం చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం పరిష్కారానికి చర్యలు చేపట్టలేదని ఆందోళన వ్యక్తం చేశారు. 1500 మంది ఇంటి నిర్మాణ బిల్లులు చెల్లించలేదని, నిర్వాసిత కొన్ని గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించలేదని పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని లేకుంటే రైతు సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జియ్యమ్మవలస మండలం బిత్రపాడు, నిమ్మలపాడు తదితర గ్రామాల నుంచి నిర్వాసితులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇందిర

ప్రజాశక్తి కొమరాడ

మండల ప్రజలను దీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాగావళి నది అవతల వైపు ఉన్న గ్రామ ప్రజలు రాకపోకలు చేసేందుకు ఎంతో అవసరమైన పూర్ణపాడు లాభేసు వంతెన మూడు పిల్లర్లు నదిలో పనులు ఇప్పటికీ పూర్తి కాకపోవడం చాలా దారుణమన్నారు. తొమ్మిది పంచాయతీలు ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే 70 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సిన దయానియా పరిస్థితి ఏర్పడిందన్నారు. మండలంలో అంతర్రాష్ట్ర రహదారులతో పాటు గ్రామాలకు వెళ్లే రహదారులు కూడా చాలా అధ్వానంగా తయారయ్యాయని దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సరైన వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు భూ సమస్యలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏనుగులు గుంపును అటవీ ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు.

సర్కారు బడుల్లో సమస్యల కొలువు

- అర్ధాంతరంగా నిలిచిన అదనపు భవన నిర్మాణ పనులు
- ఆరుబయట వంటలు
- విద్యార్థులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, పాలకులు ఆర్భాటంగా ప్రచారాలు చేస్తున్నారు తప్ప ఆచరణలోఆ దిశగా చర్యలు లేవు. దీంతో సర్కారు బడుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సమస్యలతో దర్శనమిస్తుంది. అనేక పాఠశాలలకు అదనపు గదుల కొరత , మౌలిక సదుపాయాల్లేవు. అలాగే మధ్యాహ్న భోజన నిర్వహణకు పక్కా భవనాల్లేక ఆరుబైట, చెట్ల నీడల్లో వంటలు వండాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలల్లో గతంలో ఉన్న ఈ సమస్యలే ఈ ఏడాది విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి.

మండలంలోని మూడు జిపిఎస్ ప్రైమరీ పాఠశాలలు, నాలుగు ఫౌండేషన్ పాఠశాలలు, 19 బేసిక్ ప్రైమరీ, 16 మోడల్ ప్రాథమిక, 7మండల ప్రాథమిక ఉన్నత 11జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కెజిబివి, గిరిజన సాంఘిక సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉన్నాయి. ఆ పాఠశాలల్లో 4022 మంది విద్యార్థులు విద్యను కొనసాగిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు గణాంకాలు చెబుతున్నారు. మండలంలోని కంబరవలస, బిటివాడ, సంత నర్సిపురం, తెట్టంగి, రేగులపాడు కేజీబీవీ, తలవరం తదితర గ్రామాల్లో అదనపు భవనాల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థుల అవస్థలు పడుతున్నారు.

ఆరుబయట వంటలు

మండలంలోని గడగమ్మ, పివిఆర్ పురం, ఎం.రాజపురం, ఆడారు, చిట్టిపూడివలస, పెద్దూరు, సందిమానుగూడ, కె.ఇచ్ఛాపురం, కొంచ, రేగులపాడు, బొడ్లపాడు, తూడి, బిటివాడ, చే బియ్యంవలస, డిపి వలస తదితర గ్రామాల్లోని పాఠశాలలకు వంటశాలలు లేకపోవడంతో నిర్వాహకులు ఆరుబయటే వంటలు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏడేళ్ల కిందట లక్ష రూపాయలతో వంటగది నిర్మించేందుకు పనులు చేపట్టారు. వంటగది నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో పాఠశాల ఆవరణలోనే పాడుబడిన పాఠశాల గదిలో నిర్వాహకులు వంటలు చేసి విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. గ్రామంలోని మోడల్ ప్రాథమిక పాఠశాలలోనూ ఇదే పరిస్థితి.

ఇరుకైన గదిలో విద్యాబోధన

మండలంలోని చిట్టిపూడివలస, కె.ఇచ్ఛాపురం తదితర గ్రామాల పాఠశాలలకు అదనపు భవనాల్లేకపోవడంతో విద్యార్థులకు ఇరుకైన గదుల్లోనే విద్యా బోధన చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. యు వెంకంపేట పాఠశాలకు ఆదనపు భవనం లేకపోవడంతో అందులోని విద్యార్థులకు విద్యతో పాటు విద్యార్థులకు వంట నిర్వాహకులు మధ్యాహ్న భోజనం తయారు చేసి విద్యార్థులకు అందజేస్తున్నారు. అలాగే మండలంలోని పెద్దూరు, సందిమానుగూడ, యు.వెంకంపేట తదితర గ్రామాల్లోని పాఠశాలలు శిథిలావ్యవస్థకు చేరుకోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా ఆ నీరంతా శ్లాబ్ పైనుంచి కిందకు జారడంతో వర్షపు నీటిలోని విద్యార్థులు విద్యను కొనసాగిస్తున్నారు. ఇవి కూలెందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎప్పుడు ఎటువంటి ప్రమాదవార్త వినాల్సి వస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పాపంపేట పాఠశాల విద్యార్థులు లేని సమయంలో వెనుక భాగం గోడ కూలిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రస్తుతం ఆ పాఠశాల ఓ అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు.


విద్యార్థులకు తప్పని అవస్థలు

మండలంలోని గాదిలంక, సింధూనగర్, గదబవలస, వంకాయలగెడ్డ గిరిజన గ్రామాల్లో పాఠశాలల మూతపడడంతో వంకాయగెడ్డ గ్రామ గిరిజన విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలో గల ఎం.రాజపురం పాఠశాలకు వచ్చి విద్యను కొనసాగిస్తున్నారు. కాగితాడ గిరిజన విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కంబర పాఠశాలకు వచ్చి విద్యను కొనసాగిస్తున్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బలగుడ్డ గ్రామ విద్యార్థులు కె.ఇచ్ఛాపురం వచ్చి చదువుకుంటున్నారు. గదబవలస, సింధు నగర్, గాదిలంక పాఠశాలలు మూసివేయడంతో గాదిలంక గ్రామ విద్యార్థులు కిలోమీటర్ల దూరంలో ఉన్న మూలలంక గ్రామ పాఠశాలకు, సింధునగర్ విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దూరు పాఠశాలకు, గదభవలస విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలో గల కత్తుల కవిటి వచ్చి చదువుకుంటున్నారు. నీలంపేట, శాంతిగూడ, కొత్తగూడ విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న హుస్సేన్‌పురం వచ్చి విద్యను కొనసాగిస్తున్నారు. గదబవలసలో పాఠశాల మూసివేయడంతో ప్రస్తుతం ఆ భవనం పంచాయతీ కార్యాలయంగా నిర్వహిస్తున్నారు.

కాలకృత్యాల కోసం ఆరు బయటకు పరుగులు

వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర), కంబరవలస, కత్తులకవిటి, బిటివాడ తదితర గ్రామ పాఠశాల విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకొనేందుకు ఆరు బయటకు పరుగులు తీస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిల్చిపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి సర్కారు బడుల్లో సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈ విషయమై ఎంఇఒ-2 కె.ఆనందరావు వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తవించగా పాఠశాలల్లోని సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించినట్టు తెలిపారు.



శిథిల వ్యవస్థలో చేరుకున్న పెద్దూరు గిరిజనం పాఠశాల



గడగమ్మలో పూరి పాకలో భోజనం వండుతున్న వంట నిర్వాహకులు (ఫైల్ ఫోటో)

కష్టపడి చదవండి... ప్రయోజకులు కండి

ప్రజాశక్తి - పాలకొండ

కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని స్థానిక నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండల రావు విద్యార్థులను కోరారు. నగర పంచాయతీలోని ఇందిరానగర్ కాలనీలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు స్థాయి పెరిగిన పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ పాఠశాల స్థాయి పెరగడం అవసరమన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లకుండా పదో తరగతి వరకు చదువుకోడానికి అవకాశం కలిగిందన్నారు. ఉపాధ్యాయులు కూడా మెరుగైన విద్యా బోధన అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీఇఒ పి.కృష్ణమూర్తి, ఎంఇఒ జనార్ధన, కౌన్సిలర్ అడపా బాబ్జీ, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

లచ్చయ్య పేటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం


మరుగును తొలగిస్తున్న సిబ్బంది

మండలంలోని లచ్చయ్యపేటలో పారిశుధ్య పనులు గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని కాలువల్లో మురుగు నీరు, ట్యాంక్, బోర్లు వద్ద శుభ్రత వంటి పనులను చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పెదబోగిలి ఇఒగా సురేష్

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పెదబోగిలి మేజర్ పంచాయితీ ఇఒగా పి.సురేష్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన ఇచ్ఛాపురంలో పనిచేసే బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అందరి సహకారంతోనే పంచాయతీకి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.తేరేజమ్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని బాలగొడబలో గురువారం శ్రీకాకుళం జిల్లా రాగోలుకు చెందిన జేమ్స్ ఆసుపత్రి యాజమాన్యం సహకారంతో కమ్యూనిటీ పారామెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని రోగులకు వైద్యులు తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి ఆస్పత్రి యాజమాన్యం ఉచితంగా మందులు అందజేసింది. శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులను వైద్యులు ఆసుపత్రికి సిఫార్స్ చేశారు. కార్యక్రమంలో జేమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వి.జోత్స్న, డి.సాయి దుర్గ, ఎం.పి అసోసియేషన్ ఆఫ్ ఇండియా పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గ్రామ సర్పంచి పండు, పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఇఒ ఆనందరావు

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తలవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ ప్రాథమిక పాఠశాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి-2 ఆర్.ఆనందరావు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ప్రధానోపాధ్యాయులు ఆదేశించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

ఏడాది పాలనలో చేసింది శూన్యం

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో గిజనులకు చేసింది శూన్యమని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పెన్షన్, తల్లికి వందనం లాంటివి అందరితో పాటు గిరిజనులకు వచ్చింది తప్పితే గిరిజనులకు ప్రత్యేకంగా ఏమి చేయలేదన్నారు. చివరకు 1/70 చట్టం సవరించి గిరిజనులకు భూమి పై హక్కు లేకుండా చేసే కుట్రలు చేశారని ఆరోపించారు. కనీసం పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎలకు రెగ్యులర్ పిఒలను నియమించలేదన్నారు.

చిట్టిపూడివలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల పరిధిలోని చిట్టిపూడివలస గ్రామంలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, రక్తపోటు, మధుమేహ, జ్వర పీడితుల, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, సిహెచ్ఒ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా వ్యాధులు ప్రబల్లే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించాలన్నారు. ఎక్కడైనా జ్వరాలు అధికంగా ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే అక్కడ వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు జనార్దన్ రావు, శాంతకుమారి, ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రారంభమైన పాఠశాలలు

ప్రజాశక్తి - వీరఘట్టం

దాదాపు 50 రోజులు వేసవి సెలవులు తర్వాత గురువారం పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో విద్యార్థులు ఆట, పాటలకు స్వస్తిపలికి విద్యను కొనసాగించేందుకు పాఠశాలలకు చేరుకున్నారు. మండలంలోని 62 పాఠశాలల పరిధిలో 5,383 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉన్నప్పటికీ తొలిరోజు 3,963 మంది విద్యార్థులు పాఠశాలలకు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి- సాలూరు

పేద ప్రజలకు పంపిణీ చేయవలసిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు గురువారం పట్టుకున్నారు. పట్టణ పరిధిలో ఎపి39టిఇ 7153 నంబరు గల ఆటోలో ఒడిస్సా రాష్ట్రం పొట్టంగికి చెందిన బండకొల్లు అనే అసామి 545 కిలోల పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా స్థానిక పెట్రోల్ బంక్ వద్ద ఆటో ఆపి సిఎస్‌డిటి రంగారావు పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తి మీద 6ఎ కేసు నమోదు చేసి సరుకును ఎమ్ఎల్ఎస్ పాయింట్ దగ్గర అప్పగించారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఎదురెదురుగా మోటార్ సైకిళ్ళు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని జమదాల గ్రామానికి చెందిన కొర్రా శంకర్రావు మోటార్ సైకిల్ పై బందలుప్పి వెళుతుండగా అదే మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన ఎక్కంశెట్టి గణేష్ మోటార్ సైకిల్ పై బందలుప్పి నుంచి వస్తుండగా జమదాల బందలుప్పి గ్రామాల మధ్య ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈసంఘటనలో శంకర్రావు కుడి కాలుకు స్వల్ప గాయాలు కాగా గణేష్ కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు మేక్సి క్యాబ్ ద్వారా శంకర్రావును జిల్లా ఆసుపత్రికి గణేష్‌ను బైపాస్ రోడ్డులో గల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్



పార్వతీపురం: నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

స్థానిక మున్సిపాల్టీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు గురువారం వినతిని అందజేశారు. అనంతరం యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాముడు, శంకరు మాట్లాడుతూ పుస్కాట్ బళ్లు 15 ఏళ్ల నాటివి కావడంతో దాదాపు పూర్తిగా పాడైపోయాయని, వాటితోనే కార్మికులు పనులు నిర్వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున వెంటనే నూతన బళ్లు ఇప్పించాలని, మున్సిపాల్టీలో చనిపోయిన కార్మికులకు నష్టపరిహారం నేటికీ అందలేదని, వారి కుటుంబాలకు ఇవ్వాల్సిన ఉద్యోగాలు ఇవ్వలేదని కౌన్సిల్‌లో తీర్మానం చేసి రెండున్నరేళ్ల దాటినా కార్మికుల సమస్యలు పరిష్కారం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ విస్తీర్ణం పెరిగినా కార్మికులను పెంచకుండా పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దీనివల్ల పని భారం పెరిగిందని, గతంలో ధర్నా సందర్భంగా ప్రస్తుత మంత్రి మున్సిపాలిటీ వద్ద నిధులు లేకపోయినా తన నిధుల నుంచైనా కాంట్రాక్ట్ కార్మికులందరికీ సబ్బులు, నూనెలు, చెప్పులు, యూనిఫారం ఇస్తామని హామీ ఇచ్చి నెలలు దాటుతున్నా అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పట్టణంలో డస్ట్ బిన్లు అన్ని ప్రాంతాల్లో పాడయ్యాయని, కొత్తవి మంజూరు చేయాలని కోరారు. విజయవాడ వరదల సందర్భంగా సాలూరు నుంచి హాజరైన కార్మికులకు రావాల్సిన గౌరవ వేతనం, బట్టలు అన్ని పట్టణాల్లో ఇచ్చినా అధికారుల నిర్లక్ష్యం వల్ల నేటికీ సాలూరులో ఇవ్వలేదని, పారిశుధ్య పనుల మినహా పారిశుధ్యయేతర కార్యక్రమాలు యూనియన్ వ్యతిరేకిస్తున్నందున పై సమస్యలు పరిష్కారం చేసేంత వరకు అవసరమైతే ఆందోళన కూడా కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎన్ వై నాయుడు, సభ్యులు మాధవ, రామారావు, గోవిందు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

పార్వతీపురం టౌన్ : మున్సిపల్ ఇంజినీరింగ్, వాటర్ సప్లయి, విద్యుత్ దీపాల నిర్వహణ విభాగంలో పనిచేసే కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని మున్సిపల్ కార్మికులు అన్నారు.కార్మికులు చేస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 15 ఏళ్లు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్‌టెక్నికల్ కార్మికులకు రూ.24,500 చెల్లించాలని, ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు చేయాలని, విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన కార్మికులకు రూ. ఐదు లక్షలు ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, 55 ఆదివారాలు, 17 దేశ, రాష్ట్ర పండగ సెలవులు అయినా ప్రకటించాలని, లేకుంటే వేతనాలైనా ఇవ్వాలి అని అన్నారు. ఈ నిరసనలో టి.వినయ్, బి.ఉమామహేశ్వరరావు, వై.శంకర్రావు, ఎం.రమేష్, బి.జగదీష్, పి.రమేష్, అప్పలరాజు, బాల, తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనపై టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - కురుపాం


వీరఘట్టం: కేక్ కట్ చేస్తున్న భూదేవి, తదితరులు

ఏడాది కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్ర రాష్ట్రం సాగుతుందని టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య అన్నారు. గురువారంతో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర పాలన సందర్భంగా మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంపటాపు భారతి, మాజీ జెడ్‌పి కో ఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, కర్రి శ్రీను, సురేష్, బలగ రామకృష్ణ, మంతిని త్రిపురనాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని శ్రీపంచముఖ ఆంజనేయ ఆలయం వద్ద నియోజకవర్గం బాధ్యులు పడాల భూదేవి ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఖండాపు వెంకటరమణమూర్తి, గర్భాన శ్రీను, సాదు నారాయణరావు, ఎన్నింటి వెంకటరమణ, పప్పల మహేష్, తమరాపు అప్పలనాయుడు, ఎస్ బుజ్జి, వై ప్రసాదరావు పాల్గొన్నారు.

పాలకొండ: పట్టణంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో గురువారం టిడిపి నాయకులు సంబరాలు చేపట్టారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, ఎంపిపి బొమ్మల భాను, ఆకుల కుమార్, జాడ శ్రీధర్, కర్నేని యోగిత, ప్రశాంత్ కుమార్ రమేష్, మహేష్, పాల్గొన్నారు.

భూదేవి ఆధ్వర్యంలో.....

టిడిపి ఇన్చార్జ్ భూదేవి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి వైస్‌చైర్మన్ ముంజేటి త్రినాధ్, సర్వారావు, చొంగ శివానంద, అల్లు బుల్లి, కొప్పర సుభాషిణి, హేమాలత, రత్నకుమారి, గుమ్మడి గోవిందు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయబాబు ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని కృష్ణపల్లిలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవి తన క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.

సాలూరు రూరల్ : స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. అనంతరం క్యాంప్ కార్యాలయం నుంచి బోసు బొమ్మ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సాలూరు పట్టణ, మండల, మక్కువ, మెంటాడ, పాచిపెంట మండలాల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, గుళ్ల వేణు, చలుమూరి వెంకటరావు, ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, బూస తవుడు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిసభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పగలే వెలుగుతున్న లైట్ (వృత్తంలో)

పగలే విద్యుత్ వెలుగులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయ భవనంపై ఉన్న విద్యుత్ దీపం గురువారం పగటి పూట కూడా వెలుగుతూ దర్శనమిచ్చింది. కౌన్సిల్ సమావేశం జరుగుతున్న సందర్భంలో కూడా ఈ విద్యుత్ వెలుగులు ఉండడంతో పలువురు కౌన్సిల్ సభ్యులతో పాటు, స్థానికులు కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బంది తీరుపై బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా కార్యాలయంలో ఉన్న ఇంజనీరింగ్ విభాగం అధికారులు చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్కూళ్లలో పుస్తకాల విక్రయం ఆపాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కేలా సాలూరులోని పలు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు నిలిచాయని, విచ్చలవిడిగా పుస్తకాల వ్యాపారం చేపడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి.అఖిల్ అన్నారు. గురువారం స్థానిక లయిన్స్ క్లబ్ స్కూల్ యాజమాన్యం పుస్తకాల విక్రయాలు చేపడుతుండడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులకు సమాచారం తెలిపినప్పటికీ స్పందించకపోవడంతో పుస్తకాలతో స్కూల్ బయట బైఠాయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం ముందే కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యారంగాన్ని వ్యాపారంగా మలుచుకొనే ప్రయత్నాలు చేపడుతున్నాయని ఇది చాలా దుర్మార్గమని మండిపడ్డారు. నాణ్యమైన విద్య పేరుతో యాజమాన్యాలు వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయని, తల్లిదండ్రుల రక్తాన్ని పట్టిపీడిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా తరగతి గదులు నిర్వహించడం చాలా దారుణమని అన్నారు. యాజమాన్యం పుస్తకాలు, యూనిఫారం పేరుతో రూ.20 వేల నుంచి రూ.30వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. వీటిపై స్పందించాలని డిఇఒ, ఎంఇఒలకు ఫిర్యాదు చేసినా పట్టించకపోవడం అన్యాయమని వాపోయారు. గతంలో పలు విద్యాసంస్థల్లో పాఠ్య పుస్తకాలు విక్రయాలు చేపడుతున్నాయని సమాచారం తెలిపినా ఎటువంటి స్పందన లేదని, అదే తీరు లయన్ క్లబ్ స్కూల్‌పై కూడా విద్యాశాఖ అధికారులు అవలంబిస్తున్నారని ఇది ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమేనని అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దందా వెనుక జిల్లా విద్యాశాఖ అధికారుల ప్రమేయం ఉన్నట్టు స్పష్టంగా అర్థమవుతుందని, వెంటనే కలెక్టర్ స్పందించి వీరిపై చర్యలు తీసుకోవాలని, అలాగే విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకంగా పుస్తకాలు, యూనిఫాంలు అమ్మకాలు చేపడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు, కార్యదర్శు బి.శరత్, సూర్య నారాయణ, పట్టణ కమిటీ సభ్యులు శంకర్, ఉదయ్, ఎల్లిషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శన కనబర్చాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం



యోగాను పర్యవేక్షిస్తున్న డిఆర్ఒ హేమలత

రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో ఉత్తమైన ప్రదర్శన కనబర్చి, గుర్తింపు తీసుకు రావాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత కోరారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలను గురువారం ఆమె పర్యవేక్షించారు. పిల్లలు ఏ మేరకు నైపుణ్యం ప్రదర్శిస్తున్నారో పరిశీలించారు. జిల్లాలో ఈనెల 2 నుండి 6 వరకు నిర్వహించిన వివిధ మండల, పట్టణ స్థాయి యోగాంధ్ర పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో యోగా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గత నెల 21 నుంచి షెడ్యూల్ ప్రకారం వివిధ కార్యక్రమాలు జిల్లాలో నిర్వహిస్తున్నామని, ఈ క్రమంలో జిల్లా స్థాయి యోగా పోటీలు శనివారం వరకు కొనసాగుతున్న ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. వయస్సు ప్రాతిపదికన 10నుండి18, 19నుండి 35ఏళ్ళు, 35 ఏళ్లు పైబడిన వారికి సోలో యోగా విభాగానికి చెందిన ఆసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, మెడిటేషన్,యోగా గ్రూప్ ప్రదర్శన, యోగా పాటలు, చిత్రలేఖనం, స్కిట్, యోగా క్విజ్, స్లోగన్స్, పోస్టర్, ఎస్సే, యోగా ఫోటోగ్రఫీ మొదలగు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీల్లో ఉత్తమమైన ప్రదర్శన చూపి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో యోగాంధ్ర జిల్లా కన్వీనర్ డాక్టర్ టి. జగన్ మోహనరావు, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ సుశీల, జిల్లా కన్సల్టెంట్ డాక్టర్ రఘు, ఆయుష్ వైద్యులు డాక్టర్ హేమాక్షి, డాక్టర్ వర్మ, యోగా మాస్టర్స్ మోహన్ గంటాయత్, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

అజెండాలోని రెండు అంశాలు వాయిదా

◆చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు, వైసిపి కౌన్సిల్ సభ్యులు వాకౌట్ ◆చైర్ పర్సన్ తీరుపై టిడిపి సభ్యుల తిరుగుబాటు


ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్


కార్యాలయం నుంచి బయటకు వచ్చేస్తున్న కౌన్సిలర్లు

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చైర్పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. మున్సిపల్ ఉద్యోగి అజెండాను చదివి వినిపిస్తుండగా, 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇన్ని అంశాలతో అజెండాను రూపొందించలేదన్నారు. అజెండాలో 67, 72 అంశాలను వాయిదా వేస్తూ, ఈ రెండు అంశాలపై ప్రత్యేక కమిటీ వేసి నిర్ణయం తీసుకుందామని, మిగిలిన అంశాలు అన్నింటిని ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించి సమావేశ మందిరం నుంచి ఆమెతో పాటు వైస్ చైర్మన్లు, వైసిపి కౌన్సిలర్లు వెళ్లిపోయారు. సమావేశ పూర్తికాకుండానే చైర్పర్సన్ వెళ్లిపోవడంపై టిడిపి మెజారిటీ కౌన్సిల్ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో మెజార్టీ కౌన్సిల్ సభ్యుల ఆమోదమే తీర్మానమని కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, మంత్రి రవికుమార్ కమిషనర్‌కు స్పష్టం చేశారు. 17 మంది టిడిపి కౌన్సిలర్లతో పాటు, ఒక కోఆప్షన్ సభ్యులు అజెండాలోని అంశాలన్ని ఆమోదిస్తూ చేతులు ఎత్తి తీర్మానించడం విశేషం. ఈ విషయంపై విలేకరులు కమిషనర్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా సమావేశం పూర్తి కాకుండానే మధ్యలో చైర్పర్సన్ వెళ్లిపోవడం సభా మర్యాద కాదని, అయితే మెజార్టీ కౌన్సిల్ సభ్యుల తీర్మానాలను కూడా మున్సిపల్ చట్ట ప్రకారం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చైర్‌పర్సన్ తీసుకున్న నిర్ణయంపై మెజార్టీ పార్టీ కౌన్సిలర్లు డీసెంట్‌ను కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ కూడా సంతకాలు చేసి ఇవ్వవచ్చునని స్పష్టం చేస్తూ, సమావేశాన్ని ముగించేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గున్నేష్, పాలకవర్గ కౌన్సిల్ సభ్యులతో పాటు, మేనేజర్ లక్ష్మి, ఆర్ఒ రూబెన్, డిఇ శ్రీనివాసరాజు, జెఎఒ అశోక్, ఎఇలు సన్యాసిరావు, అప్పారావు, ప్రజారోగ్య అధికారి ఫకీర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యో బాబోయ్ గ్రంథాలయమే!

ప్రజాశక్తి - మక్కువ



పిచ్చి మొక్కల మధ్యలో ఉన్న గ్రంథాలయం

స్థానిక శాఖా గ్రంథాలయం విష సర్పాలు కీటకాలకు ఆవాసంగా మారింది. గ్రంథాలయం చుట్టూ పిచ్చి మొక్కలు పేరుకుపోయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదు. దీంతో గ్రంథాలయానికి వెళ్లాలంటే భయమేస్తుందని పలువురు పాఠకులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ గ్రంథాలయం ఎప్పుడు తెరుస్తారో ఎప్పుడు మూస్తారో తెలియని పరిస్థితి నెలకొందని ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఇక్కడ శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ ఉన్నారా లేరా అన్నది కూడా తెలియడం లేదని స్థానికులు అంటున్నారు. గ్రంథాలయానికి వెళ్తే కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదని, ఏ పుస్తకాలు కావాలన్నా స్వీపర్‌ను అడగాల్సిన పరిస్థితి వస్తుందని వాపోతున్నారు. గ్రంథాలయ సమస్యలపై స్థానిక ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.లక్ష్మిని వివరణ కోరగా లైబ్రేరియన్‌గా లక్ష్మీ అనే మహిళను నియమించామన్నారు. గ్రంథాలయ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా ఏ విధమైన బిల్లులు పెండింగులు లేకుండా సరిచేస్తున్నామని ఆమె తెలిపారు.

తక్షణమే తాగునీరు సరఫరా చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - వీరఘట్టం



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

రక్షిత మంచినీటి పథకం ద్వారా తక్షణమే తాగునీరు సరఫరా చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. గురువారం వీరఘట్టంలోని బిసి కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లు గంగు నాయుడు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర పరిశీలించి, అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసి, ఎస్‌సి కాలనీ, చర్చి వీధి, రెల్లి వీధులకు తక్షణమే తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. వీరఘట్టంలో ప్రతి వీధికి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి తాగునీరు అందించాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి పాయింట్ వేయాలని డిమాండ్ చేశారు. పేరుకే మేజర్ పంచాయతీ తప్ప అన్ని వీధుల్లో తాగునీటి సమస్యతో పాటు ఎక్కడికక్కడే కాలువలు శిథిలమైపోవడంతో కురుస్తున్న వర్షాల కారణంగా మురికి నీరంతా రోడ్డుపై నిలిచిపోతుందని, దీంతో ప్రజలు వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు మంచం పట్టక ముందే మేజర్ పంచాయతీలో గల అన్ని వీధులను శుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ఏది ఏమైనా పట్టణ ప్రజలకు తాగునీరందించేందుకు పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎన్.సింహాచలం, శివ, కృష్ణ, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కురుపాం


బురదమయమైన కొత్తగూడ రోడ్డు

గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి బి.అనిల్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలో వలసబల్లేరు పంచాయతీలో గల కొత్తగూడ, చాపరాయిగూడ, బొడ్డగాడిగూడ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయను మాట్లాడుతూ మూడు గ్రామాల్లో సుమారు 50 గిరిజన కుటుంబాలు ప్రజలు నివసిస్తున్నారని దశాబ్దాలు గడుస్తున్న ప్రభుత్వాలు మారుతున్న ఎన్నికల ముందు ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చి వెళ్తున్నారు తప్ప అమలు చేయడం లేదని అన్నారు. నేటికీ కనీసం రోడ్డు సౌకర్యం లేకపోడం దారుణమని ఇక్కడి గిరిజనులు నిత్యావసర సరుకులకి, కొండలో పండే జీడీ, చింత, పసుపు పంటలను మార్కెట్‌లో అమ్మడానికి కాళ్ళ నడకన సుమారు పది కిలోమీటర్ల దూరం వెళ్లవలసి వస్తుందని గుర్తు చేశారు. ఎవరికైనా అనారోగ్య పరిస్థితులు వస్తే డోలి మోతలే తప్ప వేరే మార్గం లేదని డోలి మోత ద్వారా తీసుకెళ్లి మార్గమధ్యంలో ఎంతోమంది మరణించే సంఘటనలు ఎన్నో ఉన్నాయని కూటమి ప్రభుత్వంలోనైనా ప్రజాప్రతినిధుల స్పందించి తక్షణమే గిరిజన గ్రామాలకు రహదారి విద్య, తాగునీరు, వైద్యం కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు మండంగి ఇండియా, ఆరిక గంగారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ప్రలోభాలకు గురికావద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

సైబర్ నేరగాళ్లు పెట్టే ప్రలోభాలకు గురికావద్దని, వారు చేసే వివిధ మోసాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అపరిచితుల నుంచి వచ్చే మొబైల్ నెంబర్లకు బదులివ్వొద్దని, డిజిటల్ అరెస్టులు వంటివి లేవని కలెక్టర్ తేల్చి చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డిజిటల్ అరెస్ట్ అని ఎవరైనా చెప్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మొబైల్‌లో ఎలాంటి బెట్టింగ్ యాప్‌లను డౌన్లోడు చేసుకోవద్దని, వాటిని సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) ద్వారా ఇతరులకు షేర్ చేయొద్దని తెలిపారు. అలా చేసి ఇబ్బందుల్లేని సమస్యలను కొని తెచ్చుకోవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. బెట్టింగు యాప్‌లు ఉపయోగించినా, ఇతరులకు ప్రమోట్ చేసినా చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. మీ వ్యక్తిగత, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ వివరాలు ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. ఏ అనుమానం వచ్చినా వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి (www.cybercrime.gov.in) కాల్ చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.